# న్యూస్ ఇండియా తెలుగు

NEWS INDIA TELUGU Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి : 5 | సంచిక :180 | ప్రచురణ : హైదరాబాద్ | మంగళవారం,12-05-2026 | పేజీలు: 8 | వెల : 3- 00


## విద్యకు బడ్జెట్‌లో 15% నిధులు

**రానున్న కాలంలో కేటాయిస్తాం**
**మా ప్రభుత్వ తొలి ప్రాధాన్యం విద్యే**
**డ్రాపవుట్స్ తగ్గించేందుకు పాఠశాలల్లో ఇంటర్**
**విద్యా వారోత్సవాల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి**



తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యం విద్యేనని.. రాష్ట్ర బడ్జెట్‌లో రానున్న కాలంలో 15 శాతం విద్యాశాఖకు కేటాయించనున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్కారు బడి అంటే అమ్మ ఒడి అని.. పేదపిల్లలకు నాణ్యమైన విద్య అందించే దేవాలయమన్నారు. పేదింటి బాలలకు విద్యాబుద్ధులు చెప్పడంతోపాటు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములను చేద్దామని పిలుపునిచ్చారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో విద్యావారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. క్యూర్ పరిధిలో రూ. 1,761 కోట్లతో నిర్మించనున్న పాఠశాలలకు ఇక్కడి నుంచే సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మా చిన్నప్పుడు ప్రభుత్వాలు నాణ్యమైన విద్యను అందించకపోతే.. నేను ముఖ్యమంత్రిగా మీ ముందు నిలబడకపోయే వాడిని.. ఈ వేదికపై ఉన్నవారిలో 90శాతం మంది ఇక్కడుండేవారు కాదు.. ప్రస్తుతం వేర్వేరు కారణాలతో సర్కారు బడుల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఇష్టపడడం లేదు. అందుకే విద్యార్థులకు చదువు చెప్పడమంటే బరువుగా కాదు.. బాధ్యతగా భావిద్దాం. టీచర్ అంటే ఉద్యోగం కాకుండా భావోద్వేగంతో వారితో మాట్లాడదాం. రెండేళ్ల నుంచి చేపట్టిన సంస్కరణల కారణంగా విద్యలో మార్పులొస్తున్నాయి.

**విద్యార్థుల్లో నైపుణ్యాలు గుర్తించే టీచర్లను సత్కరిద్దాం..**

ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి వరకూ ఎలాగోలా చదువుకుంటున్నా.. ఇంటర్‌లో డ్రాపవుట్స్ పెరుగుతున్నాయి. వీటిని తగ్గించేందుకు కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకూ బోధించే ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయనున్నాం. వాటిలో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించనున్నాం. అల్పాహారంతో పాటు పిల్లలకు రాగి జావ, పాలు కూడా ఇవ్వనున్నాం. సర్కారు బడులు, యంగ్ ఇండియా స్కూళ్లలో చదువుకున్నవారు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లుగా మారి సర్కారు బడుల్లో చదువుకున్నానని గుండె ధైర్యంతో చెప్పాలి. తెలంగాణ ముఖ్యమంత్రిని అవుతానన్న ఆత్మవిశ్వాసం వ్యక్తం చేయాలి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే వివక్షకు గురవుతున్నామన్న భావనతో ఉస్మానియా, కాకతీయ విద్యార్థులు తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారు. వారి ఉద్యమాలతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని వర్సిటీలను పునరుద్ధరిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో 11 వేలకుపైగా టీచర్లను నియమించాం. ప్రస్తుతం రాష్ట్రంలో 1.05 లక్షల మంది ఉపాధ్యాయులున్నారు. జాతీయ విద్యావిధానం ప్రకారం 30మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలి. మన రాష్ట్రంలో 17 మందికి ఒక ఉపాధ్యాయుడున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన టీచర్లున్నా ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు.. అక్కడ ఏమంత గొప్పగా ఉంది? మన లోపాలేంటి? అని ప్రశ్నించుకుని ముందుకు వెళ్దాం. విద్యార్థుల్లో నైపుణ్యాలను గుర్తించే టీచర్లను అభినందిద్దాం. జూన్ 2, డిసెంబరు 9న వారిని సత్కరిద్దాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చాటిన పది, ఇంటర్ విద్యార్థులతోపాటు హెడ్‌మాస్టర్లు, పాలిటెక్నిక్ అధ్యాపకులకు సీఎం రేవంత్‌రెడ్డి నగదు బహుమతులు అందజేశారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు, విద్యాశాఖ అధికారులు, వివిధ విశ్వవిద్యాలయాల వీసీలు తదితరులు పాల్గొన్నారు.

## అది బండి సంజయ్ ఫ్యామిలీ మ్యాటర్.. పార్టీకి సంబంధం లేదు: బీజేపీ స్టేట్ చీఫ్

- బండి సంజయ్ కుమారుడిపై కేసు.. స్పందించిన తెలంగాణ బీజేపీ చీఫ్
- బండి భగీరథ్‌పై నమోదైన కేసుతో బీజేపీకి సంబంధం లేదని స్పష్టీకరణ
- ఈ విషయం బండి సంజయ్ కుటుంబంలో జరిగిందని వ్యాఖ్య
- బండి సంజయ్ కుటుంబ ప్రమేయం ఉంటే విచారణ జరిపించాలన్న బీజేపీ చీఫ్



కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరథ్‌పై నమోదైన కేసుతో బీజేపీకి సంబంధం లేదని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆయన తెలిపారు.

ఈ విషయం బండి సంజయ్ కుటుంబంలో జరిగిందని ఆయన తెలిపారు. బీజేపీ అంశం కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసులో బండి సంజయ్ కుటుంబ సభ్యుల ప్రమేయం ఉంటే విచారణ జరిపించాలని అన్నారు.

**మోదీ పర్యటనకు అసాధారణ స్పందన**

సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగసభకు అసాధారణ స్పందన వచ్చిందని రామచందర్ రావు అన్నారు. మోదీ పర్యటనతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలలో స్పష్టమైన ప్రకంపనలు వచ్చాయని అన్నారు. ఈ సభ విజయవంతం కావడానికి నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేశారని అన్నారు.

వైద్యులు, నర్సులు, న్యాయవాదులు, యువత, మహిళలు, వివిధ రంగాల నిపుణులు, హైదరాబాద్ నలుమూలల నుంచి బీజేపీ కార్యకర్తలతో కలిసి ఈ సభలో అపారమైన ఉత్సాహంతో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన అశేష జనసమూహం, అక్కడ వెల్లివిరిసిన ఉత్సాహం, మోదీ నాయకత్వంపై, అలాగే 'వికసిత తెలంగాణ – వికసిత భారతదేశం' అనే దార్శనికతపై ప్రజలలో పెరుగుతున్న అచంచలమైన విశ్వాసానికి సజీవ నిదర్శనంగా నిలిచిందని రామచందర్ రావు అన్నారు.

## బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసుపై ప్రత్యేక విచారణ టీం



కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పై నమోదు అయిన పోక్సో కేసుపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ కేసులో సమగ్ర విచారణ కోసం ప్రత్యేక టీం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. 2026, మే 11వ తేదీ ఈ మేరకు రాష్ట్ర డీజీపీని ఆదేశించారు సీఎం రేవంత్ రెడ్డి.

హైదరాబాద్ సిటీలోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో బీజేపీ సీనియర్ నేత, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పై పోక్సో కేసు నమోదు అయ్యింది. 17 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు బాధిత కుటుంబం కంప్లయింట్ చేసింది. మే 8వ తేదీన కంప్లయింట్ చేస్తే.. ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డీజీపీ సీవీ ఆనంద్ ను ప్రశ్నించారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రధాని మోదీ పర్యటన, భద్రతా ఏర్పాట్లలో సిబ్బంది బిజీగా ఉండటంతో ఆలస్యం అయినట్లు వెల్లడించారు డీజీపీ. ఈ కేసులో సమగ్ర విచారణ జరిపేందుకు, విచారణ కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని డీజీపీని ఆదేశించారు సీఎం రేవంత్ రెడ్డి. కేసులో పక్షపాత ధోరణి లేకుండా విచారణ చేయాలని.. బాధితులకు న్యాయం జరగాలని సూచించారు సీఎం రేవంత్ రెడ్డి.

## మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా విజయలక్ష్మి

**సభ్యురాలిగా శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు స్థానం**



తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నియమితులయ్యారు. ఛైర్‌పర్సన్‌తో పాటు ఆరుగురు సభ్యులను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. సభ్యులుగా కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత, శశికళ యాదవరెడ్డి, సదాలక్ష్మి, ఎన్.రాధాబాయి, ఉజ్మాఆషాయ్ షకీరా నియమితులయ్యారు. వీరు ఐదేళ్ల పాటు ఈ పదవుల్లో కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో వెల్లడించింది. సభ్యురాలిగా నియమితులైన కాసోజు శంకరమ్మ.. తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి. 2020లో ఏర్పాటైన మహిళా కమిషన్‌కు ఛైర్‌పర్సన్‌గా నియమితులైన సునీతా లక్ష్మారెడ్డి.. 2023లో ఎమ్మెల్యేగా గెలుపొందడంతో కమిషన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో 2024 జులైలో నేరెళ్ల శారదను కమిషన్ ఛైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. 2020లో ఏర్పాటైన కమిషన్ పదవీకాలం ఈ ఏడాది జనవరిలో పూర్తికావడంతో.. ప్రభుత్వం కొత్త మహిళా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి గద్వాల్ విజయలక్ష్మి ధన్యవాదాలు తెలిపారు. మహిళల హక్కుల కోసం కృషిచేస్తానని చెప్పారు.

## పులి పిల్లలను దత్తత తీసుకున్న తెలంగాణ గవర్నర్





హైదరాబాద్: నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా రెండు పులి పిల్లలను దత్తత తీసుకున్నారు. 9 నెలల వయసు కలిగిన "ఇషాన్" అనే మగ పులి పిల్లతో పాటు "వన్యా" అనే ఆడ పులి పిల్లను గవర్నర్ దత్తత తీసుకున్నారు. ఈ రెండు పులి పిల్లలు 30 జూలై 2025న జన్మించాయి. వీటి తల్లిదండ్రులు ప్రభాస్, మాల అనే పులులు. ఈ రెండు పులి పిల్లలకు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఇటీవలే నామకరణం చేయడం విశేషం. వన్యప్రాణుల సంరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో గవర్నర్ ఈ దత్తత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూ అధికారులు గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రోటోకాల్ పక్కన పెట్టి ఫ్రెండ్ షిప్... భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై సంకేతాలు

**హైదరాబాద్, మే11,**
హైదరాబాద్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన రాజకీయంగా విస్తృత చర్చకు దారి తీసింది. సాధారణంగా ప్రధాని ఏ రాష్ట్రానికి వెళ్లినా అధికారిక కార్యక్రమాలకే పరిమితం కావడం ఆనవాయితీ. కానీ ఈసారి తెలంగాణ పర్యటనలో భాగంగా జూబ్లీహిల్స్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసాలకు మోదీ వెళ్లడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా అధికారిక ప్రోటోకాల్‌కు అతీతంగా మిత్రపక్ష నేతల ఇళ్లకు వెళ్లడం, వ్యక్తిగతంగా పలకరించడం, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీయడం వంటి పరిణామాలు ఎన్డీయే రాజకీయాల్లో కొత్త చర్చకు కారణమయ్యాయి.తెలంగాణలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రధాని సమయం చేసుకుని మరీ నేరుగా పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లారు. ఇటీవల సైనస్ శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కొంతసేపు కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడినట్లు సమాచారం. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి వెళ్లి భేటీ కావడం రాజకీయంగా మరింత ఆసక్తి రేకెత్తించింది. ఒకే పర్యటనలో ఏపీకి చెందిన ఇద్దరు కీలక నేతల నివాసాలకు ప్రధాని వెళ్లడం అరుదైన పరిణామంగా రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఎన్డీయే కూటమిలో ప్రస్తుతం టీడీపీ, జనసేన కీలక భాగస్వాములుగా ఉన్నాయి. ముఖ్యంగా 2024 ఎన్నికల తర్వాత కేంద్ర రాజకీయాల్లో చంద్రబాబు పాత్ర మరింత ప్రాధాన్యం పొందింది. సంఖ్యాపరంగా మాత్రమే కాదు, పరిపాలనా అనుభవం, పెట్టుబడుల ఆహ్వానం, దక్షిణాదిలో రాజకీయ ప్రభావం వంటి అంశాల్లో టీడీపీని బీజేపీ కీలక మిత్రపక్షంగా చూస్తోంది. అదే సమయంలో పవన్ కళ్యాణ్ యువతలో ప్రభావం ఉన్న నాయకుడిగా, జనసేన ద్వారా ఎన్డీయేకు సామాజికంగా విస్తరణ కల్పించే నేతగా గుర్తింపు పొందారు. ఈ నేపథ్యంలో మోదీ వ్యక్తిగతంగా ఇద్దరి నివాసాలకు వెళ్లడం ద్వారా మిత్రధర్మానికి గౌరవం ఇచ్చినట్టుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.
కూటమి రాజకీయాల్లో పరస్పర నమ్మకం, వ్యక్తిగత అనుబంధం కూడా ముఖ్యమనే సంకేతాన్ని ఈ భేటీలు ఇచ్చాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గతంలో బీజేపీ -- టీడీపీ మధ్య విభేదాలు చోటుచేసుకున్నప్పటికీ, ఇప్పుడు అదే నాయకత్వంతో సమన్వయం బలపడుతున్న దృశ్యం దేశానికి కనిపించేలా చేయడంలో ఈ భేటీలు కీలకంగా మారాయని విశ్లేషణలు వస్తున్నాయి.మరోవైపు దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ వ్యూహంలో కూడా ఈ భేటీలకు ప్రాధాన్యత కనిపిస్తోంది. తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల ప్రభావం ఎక్కువగా ఉండటంతో, బలమైన మిత్రపక్షాలతో కలిసి ముందుకు వెళ్లాలనే ఆలోచన బీజేపీలో స్పష్టంగా కనిపిస్తోంది. ఆ కోణంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను రాజకీయంగా ప్రాధాన్యంతో చూడడం ద్వారా దక్షిణాదిలో ఎన్డీయే బలం పెంచాలనే సంకేతాన్ని ప్రధాని పర్యటన ఇచ్చిందని భావిస్తున్నారు.హైదరాబాద్ వేదికగా జరిగిన ఈ భేటీలు మరో ఆసక్తికర చర్చకు కూడా దారి తీశాయి. రాష్ట్ర విభజన తర్వాత కూడా హైదరాబాద్ తెలుగు రాష్ట్రాల రాజకీయ, వ్యాపార, మీడియా కేంద్రంగా కొనసాగుతోంది. అలాంటి నగరంలో ప్రధాని ఏపీ సీఎం, డిప్యూటీ సీఎం నివాసాలకు వెళ్లడం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. తెలంగాణ పర్యటనలో ఉండగానే ఏపీ రాజకీయ నాయకులతో ప్రత్యేక సమయం గడపడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.ఇటీవల అమరావతి, పోలవరం, పెట్టుబడులు, కేంద్ర సహకారం వంటి అంశాల్లో కేంద్రం నుంచి ఏపీకి అనుకూల సంకేతాలు వరుసగా వస్తున్నాయి. అలాంటి సమయంలో ప్రధాని ఈ భేటీలు చేయడం ద్వారా కేంద్ర -- ఏపీ సమన్వయం బలంగా ఉందన్న అభిప్రాయం మరింత బలపడుతోంది. ముఖ్యంగా ఎన్డీయేలో ఏపీ భాగస్వామ్యానికి ఉన్న ప్రాధాన్యతను బహిరంగంగా చాటే చర్యగా ఈ పర్యటనను రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.మొత్తంగా చూస్తే, ఇది కేవలం మర్యాదపూర్వక సమావేశం లేదా ఆరోగ్య పరామర్శ మాత్రమే కాదు. దక్షిణాదిలో ఎన్డీయే వ్యూహం, మిత్రపక్షాలకు ఇస్తున్న ప్రాధాన్యత, కేంద్ర--ఏపీ రాజకీయ సమన్వయం, భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై సంకేతాలు ఇచ్చిన పరిణామంగా ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన నిలిచింది.

# బండి భగీరధ్ ఇరుక్కున్నాడా.. ఇరికించారా...

**హైదరాబాద్, మే 11,**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ చుట్టూ వివాదాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. బండి సంజయ్ కుమారుడు ఒక బాలిక మీద లైంగికంగా దాడి చేశాడని ఇప్పటికే కేసులు నమోదు అయ్యాయి. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో ఇప్పటికే కేసు నమోదు అయింది. ఫోక్సో చట్టం కింద ఈ కేసు నమోదు కావడంతో రాజకీయంగా కలకలం చెలరేగుతుంది.దీనిపై ఇప్పటికే కేంద్రమంత్రి కుమారుడు స్పందించారు. తనపై వస్తున్న ఆరోపణలు మొత్తం నిజం కావని.. అవన్నీ బెదిరించడానికి చేస్తున్నవని ఆయన స్పష్టత ఇచ్చారు. ఇది కోట్ల కోసం తనను ఈ స్థాయిలో ఇబ్బంది పడుతున్నారని ఆయన కరీంనగర్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ నగరంలోని కొంపల్లి ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం ఐదు కోట్ల కోసం తనను ఈ స్థాయిలో ఇబ్బంది పెడుతోందని అతడు ఆ ఫిర్యాదులో స్పష్టం చేశాడు. ఆ అమ్మాయి తనకు స్నేహితుల ద్వారా పరిచయమైందని.. పార్టీలతోపాటు ఆలయాలకు కూడా ఆమెతో కలిసి వెళ్లినట్టు బండి సంజయ్ కుమారుడు స్పష్టం చేశారు. ఆమెను పెళ్లి చేసుకోవాలని లేకపోతే ఐదు కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని మంత్రి కుమారుడు చెబుతున్నారు. ఇప్పటికే ఆమెకు 50,000 ఇచ్చానని.. తనను డబ్బుల కోసం ఇంకా ఇబ్బంది పెడుతున్నారని.. తనను కాపాడాలని కేంద్ర మంత్రి కుమారుడు ఇప్పటికే చెప్పారు.



కేంద్ర మంత్రి కుమారుడి మీద ఆరోపణలు రావడం ఇదే తొలిసారి కాదు. గతంలో అతడు మహీంద్రా యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు ఒక వ్యక్తిపై దాడి చేశాడని.. కేంద్ర మంత్రి కుమారుడు వల్ల అతడు తీవ్రంగా గాయపడ్డాడని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ ఘటన జరిగినప్పుడు తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉంది. నాడు గులాబీ పెద్దలు ఈ కేసును తీవ్రంగా పరిగణించారు. అంతే కాదు కేంద్ర మంత్రి కుమారుడి మీద నాడు అధికార పార్టీకి కరపత్రం గా ఉన్న పత్రికలో ఇష్టానుసారంగా కథనాలు ప్రసారమయ్యాయి. తర్వాత ఈ కేసు సంగతి ఏమైందో తెలియదు.ఇప్పుడు కేంద్రమంత్రి కుమారుడ మీద మరో ఆరోపణలు రావడం.. ప్రధానమంత్రి తెలంగాణకు వస్తున్న సమయంలో ఈ ఘటన వెలుగులోకి రావడంతో రాజకీయంగా బండి సంజయ్ తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఈ ఘటనలో బండి సంజయ్ కుమారుడు తప్పు చేశాడా? లేదా? అనే విషయాలను పక్కన పెడితే.. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న బండి సంజయ్ కచ్చితంగా ఈ కేసును తీవ్రంగా తీసుకోవాలి. సోషల్ మీడియాలో పోస్ట్ చేసినంత మాత్రాన ప్రజల్లో నిర్దోషులు కాలేరు. సోషల్ మీడియా జస్టిస్ పాత్ర పోషించలేదు. అలాంటప్పుడు బండి సంజయ్ కచ్చితంగా తన కుమారుడి విషయంలో నిజాయితీని నిరూపించుకోవాలి. ఇప్పటికే
గులాబీ పార్టీ కౌంటర్ మొదలుపెట్టింది. తన పార్టీ అధినేత కుమారుడు కేటీఆర్ మీద పదేపదే బండి సంజయ్ ఆరోపణలు చేసేవారని.. ఇప్పుడు ఆ బాధ అర్థం అవుతుందా అంటూ ఆ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. బండి సంజయ్ కుమారుడి మీద కచ్చితంగా విచారణ జరగాలని.. అప్పుడే నిజాలు బయటికి వస్తాయని గులాబీ నేతలు అంటున్నారు.

# బండి భగీరథ్ కేసుపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్..

## డీజీపీకి తక్షణ విచారణ ఆదేశం

**హైదరాబాద్, మే 11** పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై నమోదైన కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితీవ్రంగా స్పందించారు. కేసు దర్యాప్తును వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర డీజీపీ సివి ఆనంద్ కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.
మే 8న ఫిర్యాదు అందినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి డీజీపీని ప్రశ్నించినట్లు సమాచారం. కేసు పురోగతిపై పూర్తి వివరాలను డీజీపీ సీఎంకు నివేదించారు.
ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన కారణంగా పోలీసు సిబ్బంది మొత్తం భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారని డీజీపీ వివరించారు. దీంతో కేసు విచారణలో కొంత ఆలస్యం జరిగిందని ఆయన తెలిపారు.అయితే ఈ వివరణతో సంతృప్తి చెందని సీఎం, కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.
కేసు సమగ్ర విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాలను (రాజు తరహాలో) ఏర్పాటు చేయాలని సీఎం డీజీపీకి సూచించారు. విచారణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.
బండి భగీరథ్ కేసుపై సీఎం నేరుగా జోక్యం చేసుకోవడం రాజకీయ, పరిపాలనా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. త్వరలోనే ఈ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# మోదీ బంగారాన్ని ఎందుకు కొనొద్దంటున్నారు?

**హైదరాబాద్** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం నాటి హైదరాబాద్ పర్యటన సాంతం ఆసక్తికరంగానే సాగింది. తెలంగాణ పర్యటనకు వచ్చిన మోదీ హైదరాబాద్ లో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇంటికి వెళ్లి ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఇక బీజేపీ తెలంగాణ శాఖ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించిన మోదీ బంగారం కొనొద్దంటూ దేశ ప్రజలకు పిలుపునిచ్చి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. మోదీ నోట నుంచి బంగారం కొనొద్దన్న మాట విన్నంతనే..ఆ వ్యాఖ్యలు తెగ వైరల్ అయిపోయాయి.
ఎందుకంటే దేశ ప్రజలు ఏం చేస్తే బాగుంటుందో చెప్పే బాధ్యత ప్రధానిగా మోదీకి ఉన్నా..మరీ బంగారం కొనొద్దంటూ జనానికి చెప్పడం ఒకింత వింతగానే ఉందన్న మాట అయితే బలంగానే వినిపిస్తోంది. అయినా పొదుపులో అన్నింటికంటే మెరుగైన మార్గం బంగారం కొనుగోలు. మరి అలాంటి బంగారాన్ని కొనొద్దంటూ మోదీ ఎందుకు చెప్పారు? దానికీ ఓ రీజనుంది. ఆ రీజనేమిటో మోదీనే వెల్లడించారు.



బంగారం రేట్లు ఇటీవలి కాలంలో ఓ రేంజిలో మారిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో బంగారం రేట్లు పెరిగాయి.

## ఇంకా దొరకని కల్పన ఆచూకీ

**హైదరాబాద్ :** విశ్రాంత ఐపీస్ వినయ్ రంజన్ రే భార్య హత్య కేసులో మూడు రోజులు గడుస్తున్నా నిందితుల ఆచూకీ లభించలేదు. పూణేలో ఉన్న పనిమనిషి కల్పన తల్లిదండ్రులను అదుపులోకి తీసుకొని వారి ద్వారా ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు. బెంగుళూరులో ఉంటున్న కల్పన భర్తకు కూడా ఈ దోపిడీ గురించి సమాచారం ఉన్నట్లు గుర్తించి అతని కోసం గాలిస్తున్నారు. నిందితురాలు గతంలో పనిచేసిన మధ్యప్రదేశ్, లఖ్నవూ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ నగరంలో పని చేసిన పలు ప్రాంతాల్లో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. రంజన్ రే భార్య తనూజ ఎక్కడ పడుకుంటుందని, నగలు, నగదు ఎక్కడ పెడుతుందని పక్కా సమాచారంతో కల్పన దోపిడీకి ప్లాన్ చేసిందని దర్యాప్తులో పోలీసులు గుర్తించారు.

## బండి సంజయ్ కుమారుడిని కాపాడే ప్రయత్నం

**హైదరాబాద్ :** బండి సంజయ్ కుమారుడు బండి భగీరత్పై కేసు నమోదు చేసిన పోలీసులు ఇంకా ఎందుకు అరెస్ట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రశ్నించారు.
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాష్ట్ర హోంశాఖను దగ్గర పెట్టుకున్న రేవంత్ రెడ్డితో కుమ్మక్కై కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. మైనర్ బాలికకు న్యాయం చేయకుండా, బండి సంజయ్ కుమారుడిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయమా? జరిగిన ఘటనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలి. రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని సీరియస్గా తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి. బాధితుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతుంది.

# బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బీఆర్ఎస్ శ్రేణులు

**సాగర్ :** పోక్సో కేసు బాధితురాలైన 17 ఏళ్ల మైనర్ బాలిక వ్యక్తిత్వం గురించి కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ చేసిన దిగజారుడు వ్యాఖ్యలను ఖండిస్తూ నాగార్జునసాగర్ నియోజకవర్గం హాలియా పట్టణంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ శ్రేణులు దహనం చేసారు. బండి సంజయ్ను వెంటనే అరెస్ట్ చేసి మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసారు.

## తొర్రూరు లో రైతుల రాస్తారోకో

**మహబూబాబాద్ :** మొక్కజొన్నలు తెచ్చి రెండు నెలలు అవుతుంది ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు. అకాల వర్షాలకు మొలకలు వస్తున్నాయి. ఏ రాత్రి ఏం జరుగుతుందో అని ఇక్కడే కాపలా ఉండాల్సి వస్తుందని మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండల కేంద్రంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని నినాదాలు చేసారు. . అత్తా కోడళ్ళు వెంటనే రావాలి అంటూ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు.రైతుల రాస్తారోకో తో వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

## కూల్ డ్రింక్ల కోసం రైతుల నుండి రూ. 200 వసూలు

## అదనపు కలెక్టర్కు ఫిర్యాదు చేసిన రైతులు

**యాదాద్రి భువనగిరి :** చౌటుప్పల్లోని మార్కెట్ యార్డులో కూల్ డ్రింక్ ల కోసం నిర్వాహకులు తమ నుండి రూ. 200 వసూలు చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. గన్నీ బ్యాగుల ఇచ్చేందుకు కూడా డబ్బులు అడుగుతున్నారని, హమాలి ఛార్జిలు పెంచారాని, నాలుగు రోజులకు ముందు తూకం వేసిన ధాన్యం ఇంకా తరలించకపోవడంతో అకాల వర్షానికి తడిసి పోయాయని రైతులు అక్కడికి సందర్శనకు వచ్చిన అదనపు కలెక్టర్కు ఫిర్యాదు చేసారు.

# తాగకున్నా తాగినట్లు బ్రీత్ ఎనలైజర్ మెషిన్ చూపిస్తోంది

## మంచిర్యాల డిపో ఎదుట ఆర్టీసీ డ్రైవర్ల ఆందోళన

**మంచిర్యాల :** మద్యం తాగకున్నా బ్రీత్ ఎనలైజర్ మెషిన్ తాగినట్లు చూపిస్తుందని, దీంతో అధికారులు తమను విధుల్లోకి తీసుకోవడం లేదని డిపో ఎదుట డ్రైవర్లు బైఠాయించారు. తాము మద్యం తాగలేదని మెషిన్ మార్చాలని డిమాండ్ చేస్తూ డ్రైవర్లు నిరసన కు దిగారు. పలువురు ఆర్టీసీ డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయగా 56 పైగా రీడింగ్ చూపించింది. దాంతో ఆర్టీసీ సేవలు నిలిచిపోయాయి. బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కున్నారు.

## పొలానికి నిప్పు... ఆగిపోయిన రైలు

**నెక్కొండ :** గుర్తు తెలియని వ్యక్తులు నెక్కొండ రైల్వే స్టేషన్ సమీపంలో పొలానికి నిప్పు పెట్టారు. మంటలు రైల్వే ట్రాక్ సమీపంలో ఎగిసిపడటంతో సికింద్రాబాద్ నుండి భద్రాచలంలో వెళ్లే కాకతీయ ఎక్స్ప్రెస్సు సుమారు 30 నిమిషాల పాటు నిలిపివేసారు. సమాచారం అందిన వెంటనే రైల్వే సిబ్బంది, స్థానికులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మొత్తానికి పెను ప్రమాదం తప్పింది.

## బండి సంజయ్ కుమారుడిని అరెస్టు చేయాలి

**'సిరిసిల్ల :** మైనర్ బాలికను అత్యాచారం చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిని అరెస్ట్ చేయాలంటూ సిరిసిల్ల నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. బీఆర్ఎస్వీ (దీ=వాం), బీఆర్ఎస్వై (దీ=ళా) నాయకులు సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి గూడూరు ప్రవీణ్, రాష్ట్ర నేత చీటీ నర్సింగరావు, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు పాల్గొని మీడియా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళాతో పాటు మహిళా కౌన్సిలర్లు తెలంగాణ భవన్లో ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, మహిళా కౌన్సిలర్లు కలిసి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు అందజేశారు.

## టి హబ్ లో కాగ్నిచాంప్ ఇండియా స్కాలర్షిప్

**హైదరాబాద్ :** తెలంగాణలో విద్యా రంగానికి కొత్త దిశను సూచిస్తూ లక్షకు పైగా విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహించిన కాగ్నిచాంప్ ఇండియా స్కాలర్షిప్–తెలంగాణ 2026 కార్యక్రమం టీహబ్లో నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంపిక చేసిన టాప్ 100 మేధావులు, వారి తల్లిదండ్రులు, విద్యావేత్తలు, పాఠశాలల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జయప్రకాష్ నారాయణతో పాటు కాగ్నిటివ్ స్కోర్ ఏఊఫౌండర్స్ కీర్తి కుమారైజైన్, విక్రమ్సుంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఇప్పటికే టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్లో దేశానికి నాయకత్వం వహిస్తోందన్నారు. ఇప్పుడు కాగ్నిటివ్ రెడీనెస్ కూడా ముందుండాలని, ప్రపంచ స్థాయి సంస్థలు భవిష్యత్లో ఉద్యోగులను ఎంపిక చేసేటప్పుడు మార్కుల కంటే సమస్యల పరిష్కారంలో ఎలా ఆలోచిస్తారు, ఎలా పరిష్క రిస్తారు అనే అంశాలను ఎక్కువగా పరిశీలిస్తాయన్నారు.

## కుసంగిలో విద్యా వారోత్సవాలు ప్రారంభం




**న్యూస్ ఇండియా (టేక్మాల్ రిపోర్టర్ జైపాల్ మే11)** మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని ఉచిత సమ్మర్ క్యాంపును సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్ మండల విద్యాధికారి సుజాత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నవదన గారితో కలసి ప్రారంభించారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్య వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం నాడు కుసంగి పీఎం శ్రీ ఉన్నత పాఠశాల యందు ఏర్పాటు చెసిన ఉచిత సమ్మర్ క్యాంపును కుసంగి గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్,మండల విద్యాధికారి సుజాత,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నవదన గారితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం విద్యకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నదని,విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిలో ఉన్న తెలివితేటలను,నైపుణ్యతను పెంచడానికి ఈ యొక్క సమ్మర్ క్యాంప్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.సమ్మర్ క్యాంపులో అందరూ విద్యార్థులు చేరవచ్చని ఇండోర్ గేమ్స్ ఔట్ డోర్ గేమ్స్ వంటి ఎన్నో రకాల గేమ్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా ప్రతి ఒక్క విద్యార్థికి ఉచితంగా అల్పాహారం, స్నాక్స్ అందజేయడం జరుగుతుందని తెలిపారు. పాఠశాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన గురించి ప్రత్యేకంగా చర్చించి ప్రణాళికలు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ రమేష్, గ్రామ ఉప సర్పంచ్ సుబ్బారావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సావిత్రి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు కుంట దుర్గయ్య,పత్తిగారి అనిల్ గౌడ్,కాదులూరి వెంకట్ గౌడ్, పీరని చంద్రకళ, గ్రామ పెద్దలు అంజయ్య, రామకృష్ణ రెడ్డి,అడివయ్య, పేరట్ల మొగులయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి......!

- సిపిఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్.
- బ్రిడ్జి కూలిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి.....
- సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / భద్రాచలం న్యూస్ ఇండియా,మే 11,** ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో పట్టణ వ్యాప్తంగా శివారు కాలనీలలో నీటి ఎద్దడి రోజు రోజుకి పెరుగుతుందని అధికారులు వెంటనే ట్యాంకర్ల ద్వారా మంచినీటి సప్లై చేయాలని సిపిఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ డిమాండ్ చేశారు.. సోమవారం స్థానిక చందర్రావు భవనంలో సిపిఐఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట్రామారావు అధ్యక్షతన జరిగిన సిటిఐ ఎం భద్రాచలం పట్టణ శాఖ కార్యదర్శిల సమావేశానికి ఏజే రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మిషన్ భగీరథ ద్వారా అందే గోదావరి మంచినీరు పట్టణ వ్యాప్తంగా పూర్తిస్థాయిలో అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మిషన్ భగీరథ పేరుతో చేతి బోర్లను గ్రామపంచాయతీ పూర్తిగా వదిలేసిందని ఈ ప్రభావంతో భగీరథ నీరు రాక చేతి బోర్లు పనిచేయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పంచాయతీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పట్టణంలో ఉన్న అన్ని చేతి బోర్లను రిపేరు చేసి వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. 43 సెంటీగ్రేడ్ల ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

బ్రిడ్జి కూలిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి

సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి

20 14 లో శంకుస్థాపన చేసి పది సంవత్సరాల పాటు నిర్మించిన భద్రాచలం రెండవ బ్రిడ్జి రెండు సంవత్సరాలు ఒక ముందే అప్రోచ్ రోడ్డు కూలిపోటంపై సమగ్ర విచారణ చేపట్టి సంబంధిత అధికారులు కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి డిమాండ్ చేశారు. రెండో బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు కూలిపోయిన సందర్భంలో భారీ వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని ఆయన అన్నారు. 1965లో నిర్మించిన మొదటి బ్రిడ్జి ఇప్పటికి ఎక్కువ చెదరకుండా ఉంటే బిజెపి హయంలో నిర్మించిన రెండవ బ్రిడ్జి రెండు సంవత్సరాలకి కూలిపోయిందంటే బిజెపి హయాంలో అవినీతి ఏ స్థాయిలో రాజ్యమేలుతుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని అన్నారు. ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ అవినీతికి పరాకాష్టగా బ్రిడ్జి ప్రమాదం నిలిచిందని అన్నారు. అప్రోచ్ రోడ్డు కూలిపోయిన ఘటనతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారని పర్యాటక కేంద్రమైన భద్రాచలానికి రోజు వందల సంఖ్యలో వాహన రాకపోకలు కొనసాగుతున్నాయని ఈ బ్రిడ్జి నాసిరకంతో నిర్మించడంతో ఏ రోజు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన నెలకుంటుందని అన్నారు. బ్రిడ్జి కూలిన ఘటనపై స్థానిక ప్రజాప్రతిథులు కూడా నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందని నర్సారెడ్డి ఎద్దేవా చేశారు. బ్రిడ్జి ఘటనపై అధికారులు చర్యలకు పూనుకోకపోతే సిపిఐఎం ఆధ్వర్యంలో పోరాటాలు ప్రారంభిస్తామని నర్సారెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐఎం పార్టీద్రాచలం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి సీతాలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి నకిరేకంటి నాగరాజు కుంజా శ్రీను డి రాఘవయ్య అజయ్ కుమార్ కనక శ్రీ భూపేంద్ర శాఖ కార్యదర్శులు రమణ రవీందర్ రైతులు పాల్గొన్నారు

# ప్రజావాణి విన్నతులను సత్వరమే పరిష్కరించాలి..

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి..

ప్రజావాణికి(85)ఫిర్యాదులు..



**రంగారెడ్డి జిల్లా, మే 11, న్యూస్ ఇండియా ప్రతినిధి:**రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (85) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-- 42, ఇతర శాఖలు -- 43, మొత్తం 85 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు..



**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, మే 11, న్యూస్ ఇండియా ప్రతినిధి:**ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం విక్రయాలు వెలుగుచూశాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ నగర్ మార్కెట్ లైన్ వద్ద సోమవారం తెల్లవారుజామున పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో నీలం నాగ లక్ష్మి (35) అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఆమె వద్ద నుంచి వివిధ కంపెనీలకు చెందిన సుమారు 109 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై తెలంగాణ ఎక్సైజ్ చట్టం సెక్షన్ 34(ఎ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పెద్దమ్మ గుడి నిర్మాణమునకు విరాళం అందించిన వనపర్తి శాసనసభ్యులు తుడి మెగా రెడ్డి

**న్యూస్ ఇండియా శ్రీరంగాపూర్** :శ్రీరంగాపూర్ మండల్ వెంకటాపూర్ గ్రామంలో సోమవారం రోజున పెద్దమ్మ గుడి పూజా కార్యక్రమాలు జరుగుతున్న సందర్భంలో పూజా కార్యక్రమానికి హాజరై పెద్దమ్మతల్లి గుడి నిర్మాణానికి తన వంతు సహాయం నిర్మాణం కొరకు వనపర్తి శాసనసభ్యులు తుడిమేగా రెడ్డి దైవ భక్తితో 300000 మూడు లక్షలువిరాళం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దమ్మ గుడి సభ్యులు గ్రామ ప్రజలు గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# తొర్రూర్‌లో వైభవంగా బీరప్ప స్వామి కళ్యాణం..



తెలంగాణ గ్రామీణ సంస్కృతికి బీరప్ప ఉత్సవాలు ప్రతీక..

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి..

**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, మే 11 న్యూస్ ఇండియా ప్రతినిధి:**తెలంగాణ గ్రామీణ సంస్కృతికి బీరప్ప ఉత్సవాలు ప్రతీకలని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్ గ్రామంలో బీరప్ప స్వామి కళ్యాణమహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బీరప్ప--కామరతి కళ్యాణం కనులపండువగా సాగింది. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వేడుకల్లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పాల్గొని కళ్యాణాన్ని వీక్షించారు. అనంతరం స్వామివారి ఆశీస్సులు తీసుకుని మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ గ్రామీణ సంస్కృతికి బీరప్ప ఉత్సవాలు ప్రతీకలని అన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. ఆధునిక కాలంలో జానపద కళలు అంతరించిపోకుండా వారసత్వాన్ని కొనసాగిస్తున్న ఒగ్గు కళాకారులను ఆయన అభినందించారు. భక్తుల సౌకర్యార్థం గ్రామం నుంచి ఆలయం వరకు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆలయ అభివృద్ధి, కురుమల సంక్షేమానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. వేడుకల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు తదితరులు హాజరయ్యారు.

## కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను వెంటనే బర్తరఫ్ చేసి, బండి సంజయ్ కొడుకుని వెంటనే అరెస్ట్ చెయ్యాలని ఇచ్చోడా మండల కేంద్రంలో రాస్తా రోకో చేసిన ఇచ్చోడా బీఆర్ఎస్ నాయకులు....



**అదిలాబాద్ జిల్లా ప్రతినిధి.....**మైనర్ బాలిక అని తెలిసి కూడా బండి సంజయ్ కుమారుడు అత్యాచారానికి ఒడిగట్టాడు.
బీజేపీ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలి. పోక్సో కేసులో నిందితుడైన కేంద్ర మంత్రి కొడుకుపై కఠిన చర్యలు తీసుకుని, ఆ బాలికకు న్యాయం జరిగేలా చూడాలి అని, పోక్సో కేసులో ఎఫ్ఐఆర్ చేసి 3 రోజులు గడిచినా.. అరెస్టు చేయరా,
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసు వ్యవహారంలోనూ సైబరాబాద్ పోలీసులు విచిత్ర ధోరణి అవలంబిస్తున్నారు. సాధారణంగా మైనర్‌పై ఎవరైనా అఘాయిత్యాలకు పాల్పడినట్టు ఫిర్యాదులు అందిన వెంటనే ఆరోపణలు ఎదుర్కొనే వ్యకిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, సదరు వ్యక్తిని పిలిపించి విచారిస్తారు.కానీ బండి భగీరథ్ కేసు వ్యవహారంలో చూపిస్తున్న ఉదాసీనత సామాన్యులపై మాత్రం కనిపించదు. లైంగిక దాడి కేసు లేదా పోక్సో కేసు నమోదైనప్పుడు వెంటనే ఆరోపణలు ఎదుర్కొనే వ్యక్తిని పిలిపించి విచారణ మొదలుపెడతారు. విచారణ పేరుతో నిజాలను రాబట్టేందుకు నిందితుడికి చుక్కలు చూపిస్తారు కానీ లైంగిక వేధింపులకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న భగీరథ్‌పై ఎఫ్ఐఆర్ నమోదై మూడు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు కనీసం నిందితుడిని పిలిపించి విచారించే సాహసం పోలీసులు చేయలేదు అని కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజెపి కలిసి బండి సంజయ్ కొడుకు ని కాపాడుతున్నారని, వెంటనే బండి సంజయ్ కొడుకుని అరెస్ట్ చేసి, బండి సంజయ్ ను బర్తఫ్ చెయ్యాలని ఇచ్చోడా మండల కేంద్రం లో ధర్నా చేసారు,ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కృష్ణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, మాజీ సర్పంచ్ ముండే పాండురంగ్, నర్వాడే రమేష్, సర్పంచ్ అల్తాఫ్, సర్పంచ్ ఆజిజ్ ,సర్పంచ్ ప్రవీణ్, సాబీర్, ప్రవీణ్,గణేష్,లక్ష్మి మరియు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

## బిజెపి, బిఆర్ఎస్ పార్టీ, వార్డు మెంబర్స్, కాంగ్రెస్ పార్టీలో చేరికలు,

**చేగుంట న్యూస్ ఇండియా:**దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో భారీగా బారీగా చేరికలు,
చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామ పంచాయతీ 7 గురు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో చేరడం జరిగింది,
1వ వార్డు సభ్యులు మఠం నాగరాజ్ . 2వ వార్డ్ సభ్యులు నీల నర్సింలు. 3వ వార్డ్ సభ్యులు చాకలి శ్యామల నవీన్ . 4వ వార్డు సభ్యులు నీల మణెమ్మ బిక్షపతి 5వ వార్డ్ సభ్యులు కుమ్మరి రమ్య రాజు 6వ వార్డ్ సభ్యులు గుండమైన నవీన్ 8వ వార్డు సభ్యులు నెల్లూరి లక్ష్మీ కనకయ్య. వీరందరికి కాంగ్రెస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి మరియు వార్డు సభ్యులు వారి గ్రామ సమస్యలను చెరుకు శ్రీనివాస్ రెడ్డి కి తెలియజేయడం జరిగింది, ఇబ్రహీంపూర్ గ్రామానికి సుమారుగా 30 లక్షల రూపాయల నిధులను జిల్లా ఇన్చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి కొరకు శాంక్షన్ చేయించడం జరుగుతుంది అని అన్నారు,
ఈ కార్యక్రమంలో చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ చేగుంట మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు సంద్రుగు స్రవంతి సతీష్ ఇబ్రహీంపూర్ ఉపసర్పంచ్ చౌదరి శ్రీనివాస్ చేగుంట ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీ . నయీమ్ తదితరులు పాల్గొన్నారు



## రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సరిత తిరుపతయ్య.

**జోగులాంబ గద్వాల జిల్లా న్యూస్ ఇండియా**ఈరోజు హైదరాబాద్‌లోని ప్రగతిభవన్ లో రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు గౌరవనీయులు శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారిని, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ మరియు గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీమతి సరిత తిరుపతయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.
?తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించినందుకు, ఈ సందర్భంగా మంత్రి ని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.
నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రితో చర్చించడంతో పాటు, రాబోయే రోజుల్లో సమాఖ్య ద్వారా కులవృత్తిదారుల ఆర్థికాభివృద్ధికి మరియు ప్రజా సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వివరించారు.
ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో,



ప్రజా ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.
వీరితో పాటు. జడ్చర్ల శాసనసభ్యులు అనిరుద్ రెడ్డి ఉన్నారు.

## తడిసిన మొక్కజొన్నను పరిశీలించిన,

- **ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ విజయుడు జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్ నియోజకవర్గం అలంపూర్ చౌరస్తా నందు భారీ వర్షాలకు తడిసిన మొక్కజొన్న ధాన్యాన్ని అలంపూర్ ఎమ్మెల్యే శ్రీ విజయుడు స్వయంగా ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.**









**గద్వాల జిల్లా న్యూస్ ఇండియా** అనంతరం నష్టపోయిన రైతులకు ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని తక్షణమే తరలించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం స్పందించి రెండు రోజుల్లో ధాన్యాన్ని తరలించకపోతే, రైతుల పక్షాన మూడో రోజు నుంచి ధర్నాలు చేపడతామని ఎమ్మెల్యే హెచ్చరించారు. రైతులను ఆదుకునే వరకు తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. బి ఆర్ ఎస్ పార్టీ సోషల్ మీడియా అయిజ మండలంద

## గద్వాల పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో నిర్వహించిన శ్రీ శ్రీ సత్యనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవం..

**న్యూస్ ఇండియా బోయ కిష్టన్న**
భక్తి పారవశ్యంతో, ఆధ్యాత్మిక శోభతో ఘనంగా జరిగింది. మహోత్సవం సందర్భంగా కాలనీ మొత్తం భక్తిమయ వాతావరణంతో కళకళలాడింది.
భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు.





ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కళ్యాణం కన్నులపండువగా జరిగింది. భక్తులు భక్తి గీతాలు, హరినామ సంకీర్తనలు ఆలపిస్తూ కార్యక్రమాన్ని మరింత ఆధ్యాత్మికంగా మార్చారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులందరూ స్వామివారి దివ్య ఆశీస్సులు పొందుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కాలనీ యువకులు, పెద్దలు, మహిళలు కలిసి సమిష్టిగా మహోత్సవాన్ని నిర్వహించడం విశేషంగా నిలిచింది.
శ్రీ సత్యనారాయణ స్వామి కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఈ మహోత్సవం గద్వాల పట్టణంలో ఆధ్యాత్మిక వైభవానికి నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఆర్ నాగేందర్, ప్రధాన కార్యదర్శి పోతు ఈశ్వరయ్య, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ , కోశాధికారి వెంకటయ్య, ఆలయ కమిటీ సభ్యులు మరియు గద్వాల మాజీ మున్సిపల్ చైర్మన్ జి వేణుగోపాల్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

## నకిలీ సర్టిఫికెట్లు.. నకిలీ స్టాంపులు, అక్రమార్కులను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని


- **జిల్లా కలెక్టర్ రిజ్వన్ బాషా షేక్ గారికి వినతి పత్రం అందజేత భీమ్ ఆర్మీ**
- **క్రిమినల్ కేసులు నమోదు చేసి పీడీ యాక్ట్ ప్రయోగించాలి**
- **గద్వాల జిల్లాలో నకిలీ సర్టిఫికెట్లు, నకిలీ ప్రభుత్వ స్టాంపులు తయారు చేస్తూ అమాయకులను మోసం చేస్తున్న దుండగులను వెంటనే గుర్తించాలి..**

**జోగులాంబ గద్వాల జిల్లాన్యూస్ ఇండియా**భీమ్ ఆర్మీ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఇన్చార్జి మాచర్ల ప్రకాష్ భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు మెల్లచెరువు వర్షిత్
జోగులాంబ గద్వాల జిల్లాలో నకిలీ స్టాంపులు నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి పేద అమాయకులను మోసం చేసే వారిని కఠిన చర్యలు తీసుకోవాలని ఈరోజు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా కి భీమ్ ఆర్మీ నాయకులు అందజేశారు ఈ అక్రమ దందా వెనుక ఉన్న ఎంతటి వారినైనా వదలకుండా కఠినమైన కేసులు (జతీఱఎఱఱఖశ్రీ ఝుంవం) నమోదు చేయాలనీ వారు కోరారు, ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న ఇటువంటి అసాంఘిక శక్తులపై పి.డి (ాణ) యాక్ట్



ప్రయోగించాలనీ, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న ముఠాలను కఠినంగా శిక్షించాలనీ నకిలీ ముఠాను వెంటనే గుర్తించి వారిని కఠినమైన చర్యలు తీసుకోవాలని భీమ్ ఆర్మీ నుండి విజ్ఞప్తి చేశారు అక్రమార్కులను కఠినంగా ఇక్షించాలని జిల్లా కలెక్టర్ గారిని వినతిపత్రం ద్వారా భీమ్ ఆర్మీ నాయకుల కోరారు ఈ విషయమే పూర్తి దర్యాప్తు చేస్తున్నామని కలెక్టర్ గారు తెలియజేశారు.

## జోగులాంబ రైల్వే స్టేషన్‌లో విషాదం రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వృద్ధుడు మృతి..



**గద్వాల జిల్లా న్యూస్ ఇండియా** జోగులాంబ రైల్వే స్టేషన్‌లో విషాదం రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వృద్ధుడు మృతి
రైలు నుంచి జారి పడటంతో నడుము వరకు తెగిపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం మృతుడి వద్ద షాద్‌నగర్-తిరుపతి గద్వాల-కర్నూలు రైలు టికెట్లు లభ్యం మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచిన పోలీసులు..
గుర్తుపట్టిన వారు 8341252529 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని హెడ్ కానిస్టేబుల్ అశోక్ విజ్ఞప్తి..
రైలు నుంచి జారి పడటంతో నడుము వరకు తెగిపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం మృతుడి వద్ద షాద్‌నగర్-తిరుపతి గద్వాల-కర్నూలు రైలు టికెట్లు లభ్యం మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచిన పోలీసులు..
గుర్తుపట్టిన వారు 8341252529 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని హెడ్ కానిస్టేబుల్ అశోక్ విజ్ఞప్తి..

## హైవేపై బీహార్ కూలీల దాడి: యువకులకు గాయాలు

**న్యూస్ ఇండియా మానవపాడు:** హైవే పనుల కోసం వచ్చిన బీహార్ కూలీలు ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో వీరంగం సృష్టించారు. బొలెరో వాహనంతో అమరవాయి యువకులను వెంబడించి, రాళ్లు, రాడ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. బాధితులు ఆదివారం సాయంత్రం 4:30 గంటలకు పోలీసులను ఆశ్రయించారు.





స్థానికులపై పరాయి రాష్ట్ర కూలీల దాడిపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఐజజ కార్యదర్శి సిరాజ్ డిమాండ్ చేశారు. దాడికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ప్రజనగణన ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి.



**జిల్లా కలెక్టర్ అంకిత్.**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యూస్ ఇండియా**జనగణన కార్యక్రమంలో భాగంగా సోమవారం నుండి ప్రారంభమైన ఇంటింటి సర్వే అత్యంత కీలకమైన ప్రక్రియ అని, అధికారులు సమన్వయం తో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన సర్వే నిర్వహణపై దిశానిర్దేశం చేశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గృహ గణన ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ప్రత్యేక చార్జ్ అధికారులు, సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.
ప్రతిరోజు సర్వే పూర్తైన అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి అప్లోడ్ చేయాలని ఆదేశించారు.
సర్వే నిర్వహణకు అవసరమైన ఎన్యూమరేటర్ కిట్లు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని, అవసరమైతే అదనంగా మరిన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. నేటి నుండి ప్రారంభమైన గృహ గణన ప్రక్రియ జూన్ 9వ తేదీ వరకు కొనసాగనుందని తెలిపారు. ఈ కాలంలో ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి నిర్దేశిత ఫార్మాట్‌లో వివరాలను నమోదు చేయనున్నారని చెప్పారు. ఇంటి నంబర్, గదుల సంఖ్య, కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు, ద్విచక్ర వాహనాలు లేదా కార్ల వివరాలు, మొబైల్ నంబర్ వంటి సమాచారాన్ని సేకరిస్తారని తెలిపారు .
ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పన, అభివృద్ధి కార్యక్రమాల అమలు, భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనలో ఈ గణాంకాలు కీలకంగా ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి జనగణన సర్వేను విజయవంతం చేయాలని సూచించారు

## సంపాదకీయం

# నిరీక్షణ.. నిరూపణ!?

భారత ప్రజాస్వామ్యం ఒక అపూర్వమైన రాజకీయ మలుపును చవిచూసింది. దశాబ్దాలపాటు అదే ముఖాలు, అదే వాగ్దానాలు, అదే నిరాశలతో అలసిన ఓటరు ఇప్పుడు మార్పు కోసం పట్టుపట్టాడు. పశ్చిమ బెంగాల్లో సువేందు అధికారి, తమిళనాడులో జోసెఫ్ విజయ్. ఇద్దరూ కొత్త ముఖ్యమంత్రులు. ఒకే సందేశాన్ని మోసుకొచ్చారు.. -మార్పు సాధ్యమే, పాలన మెరుగుపడాలి, ప్రజల జీవితాలు నిజంగా బాగుపడాలి! అయితే హామీలివ్వడం కళ; అమలు చేయడం పరీక్ష. ఆ పరీక్షలో ఇద్దరు ఎంతమేర నెగ్గుకొస్తారోనని యావద్దేశం ఆసక్తిగా గమనిస్తోంది.

వెండితెరపై కోటానుకోట్ల అభిమానులను సొంతం చేసుకున్న తారగా, సమాజ న్యాయం కోసం గళమెత్తిన నేతగా తమిళ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న విజయ్.. టీవీకే పార్టీ అధినేతగా రాజకీయ రంగంలో ప్రవేశించి మెరుపువేగంగా అధికారాన్ని అందుకున్నారు. అవినీతిని నిర్మూలించి, లౌకిక, పారదర్శక, ప్రజాకేంద్రిత పాలన అందిస్తానని ఆయన చేసిన ప్రతిజ్ఞ ముఖ్యంగా యువతను ఆకర్షించింది. ఆయన పార్టీ తరపున గెలిచినవారిలో 93మంది మొదటిసారి శాసనసభలో అడుగుపెట్టిన ప్రజాప్రతినిధులే. ఇది ఒకవైపు తాజా శ్వాస అయినా -మరోవైపు పాలనానుభవం లేకపోవడం కనిపించని సవాలు. అంకెలు చూస్తే పరిస్థితి స్పష్టమవుతుంది. విజయ్ ఎన్నికల్లో ప్రకటించిన సంక్షేమ హామీలన్నీ నెరవేర్చాలంటే ఏటా రూ.లక్ష కోట్లు అవసరం. రాష్ట్ర రాబడిలో 30 శాతం సంక్షేమానికే కేటాయించాలి. కానీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరకు తమిళనాడు రుణభారం రూ.10.71 లక్షల కోట్లకు చేరొచ్చని అంచనా. ఈ ఆర్థిక ఒత్తిడి నేపథ్యంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూనే, హామీలు నెరవేర్చడం కత్తి మీద సాము. మరో జటిలత -విజయ్ సర్కారుకు ప్రాణవాయువు అందిస్తున్నది డీఎంకే కూటమి పార్టీలే. ఇతర పార్టీల ద్వారా ఏర్పడిన మద్దతుపై ఆధారపడిన ప్రభుత్వం, వాటి ఒత్తిళ్లను తట్టుకుంటూ స్వతంత్రంగా పాలన సాగించడం అంత సులువు కాదు. ద్రావిడ రాజకీయాల్లో అర్ధ శతాబ్దం పైగా అనుభవం కలిగిన ఎంకె స్టాలిన్, ఈడెప్పాడి కె పళనిస్వామి వంటి ద్రావిడ యోధులను ప్రతిపక్షంలో ఎదుర్కోవడం మరింత కష్టం. వారికి నైపుణ్యమైన రాజకీయ వ్యూహాలు తెలుసు, ప్రభుత్వ బలహీనతలను ఎలా ఉపయోగించుకోవాలో కూడా తెలుసు. పారిశ్రామికాభివృద్ధిలో దేశంలోనే ముందుండే తమిళనాడులో రాజకీయ అస్థిరత నెలకొంటే పెట్టుబడులు పారిపోతాయి. ఉద్యోగ కల్పన దెబ్బతింటుంది. అప్పుడు తనను నెత్తికెత్తుకున్న యువతనుంచే వ్యతిరేకత ఎదుర్కోవాల్సిన దుస్థితి వస్తుంది. సినిమాలో కష్టకాలంలో పోరాడే నాయకుడి పాత్ర పోషించడం వేరు. వాస్తవ రాజకీయ సంకీర్ణాల్లో సమర్థంగా ముందుకు నడవడం వేరు. విజయ్ ఆ తేడాను ఎంత తొందరగా గుర్తిస్తారో, అంత వేగంగా ఆయన విజయపథంలో నడవగలరు!!


అట్టుడికిన రాజకీయ వాతావరణంలో, తీవ్రమైన హింసాత్మక ఘటనల మధ్య అధికారానికి వచ్చిన సువేందు అధికారికి మొదటి సవాలు శాంతి పునరుద్ధరణ. ఎన్నికల అనంతరం పశ్చిమ బెంగాల్లో చెలరేగిన రాజకీయ హింస ఆందోళన కలిగిస్తోంది. అది త్వరగా అదుపులోకి రాకపోతే, మొదటి అడుగులోనే ఆయన ప్రభుత్వం సమర్థత ప్రశ్నార్థకమవుతుంది. టీఎంసీ హయాంలో జరిగిన ఉద్యోగ నియామక కుంభకోణాలు, నిధుల దుర్వినియోగం రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. ఆ నష్టమైన ప్రతిష్ఠను తిరిగి సంపాదించుకోవడం ఒక్కరోజులో పని కాదు. అందుకు పారదర్శకమైన విధానాలు, జవాబుదారీతనం, నిజాయితీగల పాలన అవసరం.

చారిత్రికంగా చూస్తే, 1960ల్లో పశ్చిమ బెంగాల్ తలసరి ఆదాయం జాతీయ సగటుకంటే అధికం. అది ఈరోజు దిగజారింది. 2011 నుంచి ఏడువేలకుపైగా కంపెనీలు రాష్ట్రాన్ని వీడిపోయాయి. పాలనా వైఫల్యాలు, మౌలిక వసతుల లేమి, రాజకీయ అస్థిరత కారణాలు. దీని ఫలితంగా ఉపాధి అవకాశాలు తగ్గి, పెద్ద సంఖ్యలో బెంగాలీ యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి. ఆ బాధాకర వాస్తవాన్ని మార్చాలంటే సువేందు కోటి కొలువులను సృష్టించాలని ఇచ్చిన హామీని నిజం చేయాల్సి ఉంటుంది. అది మాటల్లో చెప్పడం కాదు, పనిచేసి చూపించాలి.

అదే సమయంలో, రాష్ట్రంలో పెట్టుబడులు ఆకర్షించాలంటే స్థిరమైన, సామరస్యపూర్ణమైన వాతావరణం అవసరం. పారిశ్రామిక విధానాల్లో సంస్కరణలు, వ్యాపార సులభత పెంచడం, పురాతనమైన భూసంస్కరణ చట్టాలను కాలానుకూలంగా మార్చడం -ఇవన్నీ ఆర్థిక పునరుత్తేజానికి అత్యవసరం. సువేందు ఇప్పుడు పెట్టుబడులకు అనుకూల పరిస్థితి నెలకొల్పి.. అప్పుడు ఫలితాల గురించి మాట్లాడాలి.

ఈ రెండు రాష్ట్రాల్లో జరిగిన మార్పు భారత రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టం. వంశపారంపర్య రాజకీయాలు, అనుభవశూన్యత, మితవాద విధానాలు.. వీటిపై ప్రజలు తిరుగుబాటు చేయగలరని నిరూపించిన సందర్భం. అయితే ప్రజల ఆగ్రహం అధికారం ఇస్తుంది. ప్రజల నమ్మకం మాత్రం పనిచేసి సంపాదించుకోవాలి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రెండూ -సాంస్కృతికంగా, ఆర్థికంగా భారతదేశానికి అత్యంత ముఖ్యమైన రాష్ట్రాలు. తమిళనాడు అన్ని రంగాల్లో ముందుండే ఇంజిన్ రాష్ట్రం. పశ్చిమ బెంగాల్ గంగా-బ్రహ్మపుత్ర డెల్టాలో సంపదకు ఇల్లు. రెండు రాష్ట్రాలూ తమ పూర్తి సామర్థ్యానికి చేరుకోవడం లేదు. అదే అవకాశం, అదే సవాలు. విజయ్ తమ జీవితంలో వెండితెరపై ఎన్నో కథానాయక పాత్రలు పోషించారు. ఇప్పుడు పోషిస్తున్న ముఖ్యమంత్రి పాత్ర -స్క్రిప్ట్ ముందే రాసినట్లు ఉండదు. ప్రతి రోజూ కొత్త సవాళ్లు, కొత్త నిర్ణయాలు, కొత్త పరిణామాలు. సువేందు తన జీవితంలో ఒక పార్టీనుంచి మరో పార్టీకి మారడమనే రాజకీయ తెగింపు చాటారు. ఇప్పుడు ఆ తెగింపు మంచి పాలన రూపంలో ఫలితాలివ్వాలి.

రెండు రాష్ట్రాలలోనూ ప్రజలు ఆశతో ఓట్లేశారు. ఆ ఆశ నిరాశగా మారకుండా చేయడానికి ఈ నాయకులిద్దరికీ ఒకే మంత్రం పనికొస్తుంది. హామీల గురించి తక్కువ మాట్లాడి.. ఎక్కువ పని చేసి ఫలితాలు చూపాలి. ప్రజలు మూర్ఖులు కారు. ఎంత ఆశతో ఓట్లేస్తారో, అంత సునిశితంగా పాలనను పరీక్షిస్తారు. చరిత్ర మార్పు కోసం ఎదురుచూస్తుంది. సమర్థులు దానికి స్పందిస్తారు, సామాన్యులు ఆగ్రహం పెంచుతారు. విజయ్, సువేందు ఏ వర్గానికి చెందుతారో -కాలమే జవాబివ్వాలి!



# నిద్ర సమయమే మీ గుండెకు రక్ష

మారుతున్న జీవనశైలి, సుదీర్ఘ పని వేళలు, ఆలస్యంగా భోజనాలు -ఇవన్నీ భారతీయుల్లో నిద్రలేమికి ప్రధాన కారణాలవుతున్నాయి. 'స్లీప్ ఫౌండేషన్' నివేదిక ప్రకారం దాదాపు 58 శాతం భారతీయులు రోజూ తగినంత నిద్ర లేక ఇబ్బంది పడుతున్నారు. చాలామంది నిద్రను విలాసంగా భావిస్తారు, కానీ నిజానికి అది జీవితాధారమైన ఆరోగ్య అవసరం. ఈ నేపథ్యంలో వైద్య నిపుణులు ముఖ్యమైన హెచ్చరిక చేస్తున్నారు. ఎన్ని గంటలు నిద్రపోతున్నారన్నదే కాదు, ఏ సమయానికి పడుకుంటున్నారన్నది కూడా గుండె ఆరోగ్యానికి అంతే కీలకమని స్పష్టం చేస్తున్నారు.

ఫిన్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఔలు శాస్త్రవేత్తలు 40 ఏళ్లు పైబడిన వేలమందిని పదేళ్లపాటు నిరంతరం అధ్యయనం చేశారు. ఆ ఫలితాలు నిజంగా ఆందోళన కలిగిస్తున్నాయి. నిద్రపోయే సమయాల్లో నిలకడ లేకుండా, రోజురోజుకూ మారుస్తున్నవారికి.. ముఖ్యంగా 8 గంటలకంటే తక్కువ నిద్రపోయేవారికి గుండెపోటు, స్ట్రోక్ వచ్చే ముప్పు రెండు రెట్లు అధికమని తేల్చారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఎప్పుడు నిద్రలేస్తున్నారన్న దానికంటే, ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకుంటున్నారా? అన్నదే గుండె ఆరోగ్యాన్ని నిర్ణయిస్తోందని పరిశోధకులు స్పష్టం చేశారు. అంటే నిద్ర నాణ్యత, క్రమబద్ధత కలిసి పనిచేస్తాయని అర్థమవుతోంది.

నిద్రపోయే సమయాలు మారినప్పుడు శరీరంపై నాలుగు రకాల ప్రతికూల ప్రభావాలు పడతాయి. మొదటిది -సిర్కాడియన్ రిథమ్. అంటే శరీరంలోని సహజ జీవ గడియారం అస్తవ్యస్తమవడం. ఈ జీవ గడియారం శరీర ఉష్ణోగ్రత, హార్మోన్ల విడుదల, జీవక్రియలను నియంత్రిస్తుంది. అది దెబ్బతిన్నప్పుడు మొత్తం శారీరక వ్యవస్థ తారుమారవుతుంది. రెండవది -రక్తపోటు అదుపు తప్పి గుండెపై అదనపు ఒత్తిడి పెరగడం. దీర్ఘకాలంలో ఇది రక్తనాళాల దెబ్బతినడానికి దారితీస్తుంది. మూడవది -కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్లు అధికంగా విడుదలై గుండెను నేరుగా దెబ్బతీయడం. నాల్గవది -ఇన్సులిన్ రెసిస్టెన్స్ తలెత్తి మధుమేహం, ఊబకాయం వంటి సమస్యలు వచ్చి అవి గుండెపోటుకు దారితీయడం. ఈ నాలుగు ప్రభావాలు ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటాయి, నిద్ర లేమి ఒక్కో దెబ్బలా గుండె సామర్థ్యాన్ని క్రమంగా తగ్గిస్తుంది.

దేశంలో ఇప్పటికే 6 కోట్లమందికిపైగా హృద్రోగాలతో బాధపడుతున్నారు. పాశ్చాత్య దేశాలతో పోలిస్తే భారతీయులు సాపేక్షంగా చిన్న వయసులోనే గుండె జబ్బులకు గురవుతున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన జీవనశైలిలో నిద్రను దెబ్బతీసే అంశాలు పలు ఉన్నాయి. ఆలస్యంగా భోజనం చేయడం వల్ల నిద్రకు సహాయపడే మెలటోనిన్ హార్మోన్ విడుదల ఆలస్యమవుతుంది. పడుకోవడానికి ముందు గంటల తరబడి స్మార్ట్‌ఫోన్ వాడటం మెదడును చురుగ్గా ఉంచి విశ్రాంతికి అడ్డుపడుతుంది. రాత్రిపూట షిఫ్టుల్లో పనిచేసేవారికి గుండె జబ్బుల ముప్పు మరింత ఎక్కువగా పొంచి ఉంటుంది. ఐటీ రంగంలో, కాల్ సెంటర్లలో పనిచేసే లక్షలాది తెలుగు యువత ఈ సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటోంది.

ఢిల్లీ ఫోర్టిస్ హాస్పిటల్ స్లీప్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ ప్రశాంత్ సక్సేనా కొన్ని ఆచరణాత్మక సూచనలు చేశారు. ప్రతిరోజూ పడుకోవడానికి, లేవడానికి ఒకే సమయం పాటించాలి --- వారాంతాల్లో కూడా మినహాయింపు ఉండకూడదు. పడుకోవడానికి 60 నిమిషాల ముందే మొబైల్, టీవీలు పక్కన పెట్టేయాలి. రాత్రి భోజనం తేలికగా, పడుకోవడానికి కనీసం రెండు గంటల ముందు ముగించాలి. సాయంత్రం 4 గంటల తర్వాత కాఫీ, టీలకు దూరంగా ఉండటం మంచిది. ఉదయం సూర్యరశ్మి తగలనివ్వడం శరీర జీవ గడియారాన్ని సహజంగా సరిదిద్దుతుంది. నిద్రకు ముందు చిన్నపాటి శ్వాస వ్యాయామాలు లేదా యోగా మనసును శాంతపరిచి నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తాయి. ముఖ్యంగా హైపర్ టెన్షన్, డయాబెటిస్ ఉన్నవారు మరియు 40-60 ఏళ్ల మధ్య వయసు వారు నిద్ర విషయంలో నిర్లక్ష్యం వహించకూడదు. నిద్ర కేవలం విశ్రాంతి కాదు -అది శరీరానికి రోజువారీ మరమ్మత్తు సమయం. నిద్ర క్రమశిక్షణ పాటించండి. మీ గుండె రేపటికి ధన్యవాదాలు చెప్తుంది!

# పొదుపు మంత్రం సరైన మందా?



ప్రపంచం ఒక విచిత్రమైన సంక్షోభ సంగమంలో ఉంది. ఒకవైపు అమెరికా-ఇరాన్ ఘర్షణలు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. మరోవైపు ట్రంప్ విధానాలవల్ల ప్రపంచ వాణిజ్యం తీవ్ర అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సికింద్రాబాద్ బహిరంగ సభలో ఇచ్చిన పిలుపు దేశవ్యాప్తంగా తీవ్రమైన చర్చకు దారితీసింది. బంగారం కొనుగోలు మానుకోండి, వంట నూనె తగ్గించుకోండి, విదేశీ మారకద్రవ్యాన్ని పొదుపు చేయండి.. అదీ దేశభక్తి అన్నారు ప్రధాని. ఈ మాటలు ఒక్కొక్కరిలో ఒక్కో అనుభూతి రేపాయి. కొందరిలో దేశాభిమానం, మరికొందరిలో ఆందోళన, ఇంకొందరిలో తీవ్రమైన ప్రశ్నలు.

హైదరాబాద్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మోదీ, ప్రపంచ సరఫరా శృంఖలంలో తలెత్తిన అంతరాన్ని ప్రస్తావిస్తూ మాట్లాడారు. యుద్ధం కారణంగా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, ఎరువుల ధరలు అసాధారణంగా పెరిగాయని, ఇది దేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోందని వివరించారు. భారతదేశానికి సొంత చమురు వనరులు తక్కువగా ఉన్నందున అవసరమైన ఇంధనాన్ని దిగుమతి చేసుకోవలసి వస్తుందని, అందుకు భారీ మొత్తంలో విదేశీ మారకద్రవ్యం వెచ్చించాల్సి వస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో రెండు నిర్దుష్టమైన విజ్ఞప్తులు చేశారు. మొదటిది -ఏడాదిపాటు బంగారు ఆభరణాలు కొనవద్దని. శుభకార్యాలు, వేడుకలు ఏమైనా సరే, ఆ ఆర్థిక సంవత్సరంలో బంగారం కొనుగోలు నిలిపివేయాలని సూచించారు. రెండవది -వంట నూనె వినియోగాన్ని తగ్గించుకోవాలని. ఈ రెండు చర్యలూ విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయడంలో దోహదపడతాయని, అది దేశభక్తి చర్యే అవుతుందని ప్రధాని స్పష్టం చేశారు. "దేశం కోసం ప్రాణాలర్పించడమే దేశభక్తి కాదు, దేశం కోసం జీవించడం, విధులు నిర్వర్తించడం కూడా దేశభక్తే" అన్న మాటలు ఆయన ఉపన్యాసంలో ముఖ్యాంశంగా నిలిచాయి.

**సంక్షోభం నిజమైనదే -సందేహం లేదు**

ప్రధాని వ్యాఖ్యలను అర్థం చేసుకోవడానికి ముందు, ప్రపంచ పరిస్థితిని పరిశీలించాలి. అమెరికా-ఇరాన్-ఇజ్రాయెల్ మూడు కోణాల ఘర్షణ పశ్చిమాసియాలో ఉద్రిక్తతను పెంచింది. దీని ప్రభావం ముడి చమురు ధరలపై మొదలై స్టాక్ మార్కెట్లు, కరెన్సీలు, లోహాల మార్కెట్లన్నింటిపైనా పడింది. 2025లో బంగారం ధర అసాధారణంగా 60 శాతానికిపైగా పెరిగింది. ఇది చారిత్రాత్మక గణాంకం. ఈ పెరుగుదలకు పలు కారణాలు ఉన్నాయి. యుద్ధంవల్ల సృష్టించిన అనిశ్చితి, అమెరికా డాలర్‌పై తగ్గుతున్న నమ్మకం, ట్రంప్ విధానాలవల్ల షేర్ మార్కెట్‌కు తగిలిన దెబ్బలు, పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తులవైపు మళ్లడం. చైనా, భారత్, పోలండ్, తుర్కియే, కజకిస్తాన్‌వంటి దేశాల కేంద్ర బ్యాంకులు 2022 నుంచి తమ బంగారు నిల్వలను గణనీయంగా పెంచుకుంటున్నాయి. ఈ పరిణామాలన్నీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న పెను మార్పులకు సంకేతాలు.

ఈ పరిస్థితిలో భారత్‌పై ఒత్తిడి నిజమైనదే. విదేశీ మారకద్రవ్య నిల్వలను కాపాడుకోవడం దేశహితమే. ప్రభుత్వం ఈ భారాన్ని తాను భరిస్తోందని మోదీ చెప్పారు. అది ముఖ్యమైన అంగీకారమే. కానీ ప్రజలనూ భాగస్వాముల్ని చేయడం అవసరమని ఆయన భావించడం అర్థమవుతుంది.

**కాంగ్రెస్ వ్యతిరేకత -న్యాయమైన ప్రశ్నలు లేవా?**

ప్రధాని వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ ఎక్స్ వేదికపై స్పందిస్తూ, ఆర్థిక ఎమర్జెన్సీ ప్లాన్ ప్రకటించకుండా సామాన్య పౌరులపై భారం మోపడం బాధ్యతారాహిత్యమని, అనైతికమని అన్నారు. ఇరాన్-అమెరికా ఘర్షణ నెలలు గడిచినా ఇంధన భద్రతపై స్పష్టమైన ప్రణాళిక లేదని ఆరోపించారు.

ఈ విమర్శలో కొంత వాస్తవం ఉందనిపిస్తుంది. ప్రభుత్వ స్థాయిలో తీసుకోగల చర్యలు అనేక ఉన్నాయి. దేశీయ చమురు ఉత్పత్తి పెంచడం, పునరుత్పాదక ఇంధన వనరులను వేగంగా అభివృద్ధి చేయడం, వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు పెంచడం, ఇతర దేశాలతో ఇంధన ద్వైపాక్షిక ఒప్పందాలు కుదుర్చుకోవడం. ఇవి దీర్ఘకాలిక పరిష్కారాలు. ప్రజలను పొదుపు మంత్రం జపించమని కోరడం తాత్కాలిక ఉపశమనం మాత్రమే.

అయితే, కాంగ్రెస్ విమర్శ పూర్తిగా నిజమైనదా? అంటే పూర్తిగా సమర్థించలేం. సంకట సమయంలో ప్రజలు, ప్రభుత్వం కలిసి నడవాలని కోరడం తప్పు కాదు. 1962, 1965 యుద్ధాల సమయంలో భారత పౌరులు స్వచ్ఛందంగా బంగారం, ఆభరణాలు ఇచ్చిన చరిత్ర ఉంది. జాతీయ సంక్షోభ సమయంలో వ్యక్తిగత పొదుపు జాతీయ ఆర్థికానికి తోడ్పడటం అసహజమేమీ కాదు. కానీ అది నైతిక ఆహ్వానంగా మిగలాలి తప్ప, ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరిహారంగా మారకూడదు.


వంట నూనె తగ్గించుకోవాలన్న విజ్ఞప్తి ఆసక్తికరంగా ఉంది. నిజంగానే భారతదేశం వంట నూనెలను భారీ మొత్తంలో దిగుమతి చేసుకుంటోంది. పామాయిల్, సోయాబీన్ నూనె వంటివి. వీటిపై బిలియన్ల కొద్దీ డాలర్లు వెచ్చిస్తున్నాం. ఒకవేళ ప్రజలు నూనె వినియోగం తగ్గిస్తే అది దేశ ఆర్థికానికి మేలు చేయడమే కాదు, ఆరోగ్యానికీ మంచిదే. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ నిపుణులు చాన్నాళ్లగా చెబుతున్నదే అది. కానీ ఇది ప్రభుత్వ ప్రకటనపై ఆధారపడి జరిగేది కాదు; ఇది విద్య, అవగాహన, ప్రత్యామ్నాయ ఆహారపు అలవాట్ల ద్వారా క్రమంగా సాధించాల్సిన మార్పు.

**అసలు సమస్య -దీర్ఘకాలిక పరిష్కారాలేవి?**

ప్రధాని విజ్ఞప్తి సందర్భోచితమే అయినా, దాన్ని దీర్ఘకాలిక ఇంధన వ్యూహంతో జత చేయాలి. భారత్‌కు సౌర విద్యుత్, పవన విద్యుత్‌లో అపారమైన సామర్థ్యముంది. ఆ దిశలో త్వరగా ముందుకు సాగితే ఇంధన దిగుమతుల ఆధారపడ్డతనం గణనీయంగా తగ్గుతుంది. అదే సమయంలో బంగారు దిగుమతులను నియంత్రించడానికి అదనపు సుంకాలు, ప్రత్యామ్నాయ పెట్టుబడి సాధనాలను ప్రచారం చేయడం వంటి విధాన నిర్ణయాలు కూడా అవసరం.

ప్రజలను పొదుపువైపు నడిపించడం అభిలషణీయమే. కానీ ఆ పిలుపు విశ్వసనీయంగా ఉండాలంటే విధానపరమైన శక్తిమంతమైన చర్యలు తొలుత అమలు జరగాలి. ప్రజలు తమ వంతు చేయడానికి సిద్ధంగా ఉంటారు. కానీ ప్రభుత్వం తన వంతు చేస్తోందన్న నమ్మకం వారికి కలగాలి. అది కలిగినప్పుడే మోదీ చెప్పిన "కలిసికట్టుగా పోరాటం" నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది.

దేశభక్తి కేవలం నినాదం కాదు -అది నిర్ణయాల్లో, కార్యాచరణలో ప్రతిఫలించాలి. ప్రభుత్వానికీ, ప్రజలకూ ఇద్దరికీ వర్తించే సత్యమిది!!



మనసులో కోపం పెట్టుకుని బతకడం.. మనం విషం తాగి శత్రువు చనిపోవాలని ఎదురుచూసినట్టే. మన పెద్దలు చెప్పిన మాట ఇది. అనవసరపు విషయాలతో మనసు పాడుచేసుకోకూడదనుకుంటే -రోజూ పడుకునే ముందు ఆ రోజు మీకు జరిగిన మంచి విషయాలు మూడు గుర్తుచేసుకోండి. అందరితో సఖ్యంగా జీవించాలని ఆశిస్తే.. ముందు మిమ్మల్ని మీరు క్షమించుకోవడం నేర్చుకోండి. సంబంధాలు నిలబెట్టుకోవాలంటే -మాట్లాడటం కంటే వినడంపై ఎక్కువ శ్రద్ధ పెట్టండి. ఏ పరిస్థితిలోనూ మనశ్శాంతి కోల్పోకూడదనుకుంటే -మీ చేతిలో లేని విషయాలను మీరు మోయడం మానేయండి. చాలు, మీరు సగం గెలిచినట్టే.

-మహాదేవ

**వింతల్లో వింతలు**

## అద్దంలాంటి చికెన్



ఇక్కడ కనిపిస్తున్నది చికెన్ పీస్ అంటే నమ్ముతారా? కాని -చైనీస్ ఫుడ్ బ్లాగర్ కాయ్ నాన్ అందరినీ ఆశ్చర్యపర్చే 'అద్దం'లాంటి చికెన్ అందిస్తున్నాడు. సాధారణ ఫ్రైడ్ చికెన్‌ను అద్దంలా పారదర్శకంగా తయారు చేయడంలో అతను విజయం సాధించారు. ఎముకను బోన్ మ్యారో, కొల్లాజెన్, జెల్ మిశ్రమంతో తయారుచేసి, మాంసాన్ని ద్రవంగా మార్చి స్పియరిఫికేషన్ అనే అధునాతన పద్ధతిలో తిరిగి పునర్నిర్మించారు. చివరికి బయటి క్రిస్పీ పొర కూడా పారదర్శకంగా తయారైంది. కానీ రుచి, ఆకృతి మాత్రం అచ్చు అసలైన చికెన్‌లాగే ఉంది. ఈ వీడియో యూట్యూబ్‌లో పది లక్షలకుపైగా వ్యూస్ సాధించింది. సైన్స్ కళాఖండంలా మారిన ఈ చికెన్ చూపరులను విస్మయంలో ముంచెత్తుతోంది!



# ఓహో.. నిజమేనా!?

మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు వశిష్ట కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రం "విశ్వంభర". వాస్తవానికి ఈ చిత్రం జనవరి 2025లో ప్రేక్షకుల ముందుకు వస్తుందని భావించారు. కానీ, ఈ సినిమా విడుదల వాయిదా పడుతూ వస్తోంది. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించి సోషల్ మీడియాలో అనేక రకాల పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. ఇటీవల వినిపించిన రూమర్ ప్రకారం, సినిమా రెండు భాగాలుగా విడుదలవుతుందని ప్రచారం జరిగింది. అయితే, దర్శకుడు వశిష్ట స్పందిస్తూ ప్రచారాన్ని కొట్టిపారేశారు. ఆ వార్తలపై వ్యంగ్యంగా స్పందిస్తూ, "ఓహో, నిజమేనా ?" అని బదులివ్వడం ద్వారా ఆయన ఆ పుకార్లకు ముగింపు పలికారు. కాగా ఈ సినిమాలో త్రిష కృష్ణన్ కథానాయికగా నటిస్తోంది. 'జగదేకవీరుడు అతిలోకసుందరి' సినిమాలోని వినోదం, 'హిట్లర్'లోని సెంటిమెంట్ ఈ సోషియో ఫాంటసీ సినిమాలో కనిపిస్తాయని సమాచారం. కాగా సృష్టి, స్థితి, లయ ఈ మూడింటి నేపథ్యంలో ఈ కథ సాగుతుందట. ఈ భారీ చిత్రానికి ఆస్కార్ విన్నర్ కీరవాణి సంగీతం అందిస్తుండగా యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ చిత్రంలో ఆషిక రంగనాథ్, రమ్య పసుపులేటి, ఇషా చావ్లా మరియు అశ్రిత వేముగంటి నందూరి కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఫోటో స్టార్!




# మమిత ప్లేస్‌లోకి మానస


హీరో శర్వానంద్, శ్రీను వైట్ల కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా 'జార్జ్ క్రిష్'. అయితే, ఈ సినిమాలో హీరోయిన్‌గా మమితా బైజును ఫిక్స్ చేసినట్టు ఆ మధ్య వార్తలు వచ్చాయి. తాజాగా ఇప్పుడు మరో పేరు వినిపిస్తోంది. హీరోయిన్ మానస వారణాసిని ఫైనల్ చేసే ఆలోచనలో టీమ్ ఉందని తెలుస్తోంది. మరి ఈ వార్త నిజమైతే.. మమితా బైజు సినిమా మానస వారణాసికి వెళ్ళిపోయినట్టే. ఇక మరోవైపు శర్వానంద్ ఇప్పటికే ఈ సినిమా కోసం తన లుక్‌పై కసరత్తులు చేస్తున్నాడు. బైకర్ కోసం సన్నబడ్డ శర్వా.. ఈ సినిమా కోసం కొంచెం వెయిట్ పెరగబోతున్నాడు. ఇక ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయి. అయితే, గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ కామెడీ 'విశ్వం' ఏవరేజ్ గా నిలిచింది. దీంతో, ఎలాగైనా మళ్లీ టాలీవుడ్‌లో తన తర్వాత సినిమాతో బిజీ అయ్యేందుకు శ్రీనువైట్ల తెగ కష్ట పడుతున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది. మరి శర్వానంద్‌కి శ్రీనువైట్ల ఎలాంటి హిట్ ఇవ్వబోతున్నాడో చూడాలి.



# 'స్పిరిట్' కోసం లాంగ్ షెడ్యూల్





పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'స్పిరిట్' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం పవర్ ఫుల్ కాప్ స్టోరీగా తెరకెక్కనుంది. సమీప భవిష్యత్తులో సినిమాకు సంబంధిం చిన కీలక షెడ్యూల్ ప్రారంభం కాబోతోంది. షెడ్యూల్‌లో భారీస్థాయి యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. కొత్త షెడ్యూల్‌లో ప్రభాస్‌కు, విలన్ పాత్రలో నటిస్తున్న వివేక్ ఒబెరాయ్‌కు మధ్య వచ్చే యాక్షన్ సన్నివేశాలు షూట్ చేస్తారట. యాక్షన్ సీక్వెన్స్‌ల కోసమే దాదాపు రెండు నెలలపాటు షూటింగ్ కొనసాగనుంది. చిత్రంలో త్రుప్తి దిమ్రి హీరోయిన్‌గా నటి స్తోంది. ప్రభాస్ లుక్ వైల్డ్ అండ్ మాస్ అవతార్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రామేశ్వర్‌తో సందీప్‌రెడ్డి మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా పూర్తి చేసినట్టు సమాచారం. ఈ చిత్రాన్ని టి-సిరీస్ మరియు భద్రకాళి పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నాయి. 'స్పిరిట్' మెయిన్ కథాంశం చాలా యూనిక్‌గా ఉంటుందని, సందీప్‌రెడ్డి వంగా నుంచి మరో వినూత్న అనుభవం ఉంటుందని సినిమా ప్రేమికులు వేచి చూస్తున్నారు.



# పూజా.. స్కిన్ షోపై ట్రోల్స్

తెలుగు సినిమా నుంచి కెరీర్ స్టార్ట్‌చేసి అతి తక్కువ సమయంలోనే సాలిడ్ స్టార్డం సాధించుకున్న కొందరు హీరోయిన్లలో పూజా హెగ్డే ఒకరు. తన గ్లామర్ మరియు నటనతో దక్షిణాది సినిమాల్లో, ముఖ్యంగా తెలుగు ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా స్థిరపడిన ఆమె, కొంతకాలం క్రితం తనకు గుర్తింపు ఇచ్చిన సౌత్ సినిమాపైనే వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం పెద్ద దుమారానికి కారణమైంది.

ఆ తర్వాత క్రమంగా సౌత్‌లో పూజా హెగ్డే దాదాపు కనుమరుగైంది. అయితే ప్రస్తుతం ఆమె కోలీవుడ్‌లో సినిమాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా 'తేరా హోం టౌన్' అనే బాలీవుడ్ సినిమాలో చేసిన గ్లామర్ షోపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సౌత్ సినిమా గురించి పలు వ్యాఖ్యలు చేసిన పూజా, బాలీవుడ్‌లో మాత్రం అంతకు మించిన స్కిన్ షో చేయడం ఏమిటని దక్షిణాది సినిమా అభిమానులు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు. దీనిపై పూజా హెగ్డే స్పందిస్తుందా? లేక లైట్‌గా తీసుకుంటుందా? అనేది చూడాలి.



# సూర్య.. ఊరమాస్ కంబ్యాక్

కోలీవుడ్ స్టార్ నటుడు సూర్య హీరోగా నటిస్తున్న మాస్ చిత్రం "కరుప్పు". దర్శకుడు ఆర్జే బాలాజీ తెరకెక్కిస్తున్న మాస్ అండ్ కోర్ట్‌రూమ్ యాక్షన్ డ్రామా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ట్రైలర్ చూసిన తర్వాత సూర్య ఫ్యాన్స్ ఇది తమ హీరోకి పక్కా మాస్ కంబ్యాక్ అని నిర్ధారించుకున్నారు. అంత బలంగా ఆర్జే బాలాజీ ట్రైలర్‌ని తీర్చిదిద్దడం విశేషం. మొదట ఎమోషనల్ టోన్‌తో ప్రారంభమైన ట్రైలర్, అక్కడ నుంచి మాస్ మూమెంట్స్, క్రేజీ యాక్షన్, త్రిష సరసన లవ్ ట్రాక్‌లతో ఇంట్రెస్టింగ్‌గా సాగుతుంది. అంతేకాదు, సూర్యకి విలన్‌గా దర్శకుడు ఆర్జే బాలాజీనే తెరపై కనిపించడం మరో హైలైట్‌గా నిలిచింది. మొత్తంగా ఇది ఒక పూర్తిస్థాయి ప్యాక్డ్ ట్రీట్‌గా అనిపిస్తుంది. ట్రైలర్‌లో విజువల్స్ అన్నీ ఒక ఎత్తు అయితే, వాటన్నింటికీ ప్రాణం పోసి బిగ్గెస్ట్ హైలైట్‌గా నిలిచింది మాత్రం సాయి అభ్యంకర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్. ఆయన స్కోర్ మొత్తం ట్రైలర్ మొమెంటమ్‌నే మార్చేసిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. దీంతో తమిళ్, తెలుగు రెండు భాషల్లోనూ సూర్య గట్టి కంబ్యాక్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. చిత్రానికి డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మాణం వహిస్తుండగా, మే 14న గ్రాండ్‌గా విడుదల కానుంది.

# జన నాయగన్‌పై తేల్చేసిన నిర్మాత

ఇళయ దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్'. ప్రస్తుతం తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, సినీ కెరీర్‌కు ఈ సినిమాతోనే తెరదించారు. రాజకీయాల్లో శాశ్వతంగా కొనసాగుతానని ముందే ప్రకటించిన విజయ్, సీఎంగా ప్రమాణ స్వీకారం కూడా చేశారు. దర్శకుడు హెచ్ వినోద్ తెరకెక్కించిన ఈ సాలిడ్ మాస్ యాక్షన్ డ్రామా విజయ్ కెరీర్‌కు ఘనమైన ముగింపు అనిపిస్తోంది. అయితే పలు అడ్డంకులు ఎదుర్కొన్న ఈ చిత్రం ఎట్టకేలకు రిలీజ్‌కు సిద్ధమైంది. ఇన్నాళ్లు రకరకాల సమస్యలు చుట్టుముట్టిన ఈ సినిమా ఇక ఆగేది లేదని కేవీఎన్ ప్రొడక్షన్స్ అధినేత స్పష్టత ఇచ్చారు. సీఎంగా ప్రమాణం చేసిన విజయ్ ఆఖరి సినిమా మరో రెండు వారాల్లో విడుదల అవుతుందని అధికారికంగా ధృవీకరించారు. దీన్నిబట్టి 'జన నాయగన్' మే 28కి లాక్ అయిపోయిందని చెప్పవచ్చు. విజయ్ అభిమానులకు ఇది నిస్సందేహంగా బిగ్ పాజిటివ్ న్యూస్.



Printed, Published and Owned by VENKATESHWARLU VUPPALA, Printed at KRK Printers #2-3-703, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013, Published at # 502, Kubera Towers, Narayanaguda, Hyderabad, Telangana -500029, Editor : VENKATESHWARLU VUPPALA, RNI NO: TELTEL/2021/81802, CELL NO: 8125551235, newsindiatelugudaily@gmail.com